క్లుప్తంగా

జీఎస్టీపై అవగాహన తప్పనిసరి



గోపాలపురం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

గోపాలపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ పన్నుల విధి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి టి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం మండలంలోని గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జీఎస్టీ పన్నుల వివరాలు వస్తువులపై తగ్గిన జీఎస్టీ వివరాలు వినియోగదారులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్.సుజాత మండల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ పాలకవర్గం ఎన్నిక

నల్లజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నూతన కమిటీ ఎంపిక చేసినట్టు గ్రంథ పాలకురాలు ఏవీ రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షురాలిగా గుదే సుశీల, ఉపాధ్యక్షుడిగా జి.శ్రీరామ్మూర్తి, కార్యదర్శిగా బలుసు రామకృష్ణ సభ్యులుగా అప్పసాని సత్యనారాయణ, కండెపు శ్రీనివాస్, పులి పాపాబాలాజీ, గుదే వెంకట సుబ్బారావు, గన్నిన అజయ్, కూచిపూడి పద్మావతి అన్నెంరెడ్డిలను ఎన్నుకున్నారు. గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యలమాటి ఆనంద్, చింతా చైతన్య, భేతిన దుర్గారావు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చాన్‌బాషా కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాసనాయుడు

నిడదవోలు: పట్టణంలోని మూడో వార్డులో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చాన్‌బాషా తల్లి హాజీన్నిమ రహ్మతున్నిషా బేగం ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా 6వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు గూడా మురళి తల్లి మృతి చెందడంతో వారి కుటుంబీకులను పరామర్శించారు. 15 వార్డు పార్టీ నాయకుడు దాసరి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబీకులను కలిసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నాయుడు

నల్లజర్ల: విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్యే కీలకమని నల్లజర్ల తహసీల్దార్ ఎస్.వి.ఎస్ నాయుడు విద్యార్థులకు సూచించారు. స్థానిక ఏకేఆర్జీ ఇంటర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకల కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల సెక్రటరీ వడ్లమూడి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం, పెంపొందించుకోవడంతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు వివాదాలకు పోకుండా చదువే పరమావధిగా భావించి ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రామారావు, డిగ్రీ ప్రిన్సిపాల్ శివరాం, ఫార్మసీ ప్రిన్సిపాల్ నల్లజర్ల సాయికృష్ణ, అధ్యాపకులు అజీజ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లు పంపిణీ



భవానీల బ్యాగులపై స్టిక్కర్లు అంటిస్తున్న ఎస్సై దుర్గా ప్రసాద్

నల్లజర్ల: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భవానీ మాలలు ధరించి జాతీయ రహదారిపై పాదయాత్రగా వెళ్తున్న మాలధారులకు శనివారం నల్లజర్లలో ఎస్సై దుర్గా ప్రసాద్ రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలదారులు వీటిని అంటించుకోవడంతో రాత్రివేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనపడతారన్నారు. తద్వారా ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. చీకటి పడే సమయానికి మాలదారులు పాదయాత్ర ఆపి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, వివరాలు తమ దగ్గర ఉంచుకోవాలన్నారు.

ప్రమాదాలకు పిలుపు

- సర్వీసు రోడ్లు, అండర్‌పాస్ నిర్మాణంపై నిర్లక్ష్యం
- అదుపు తప్పుతున్న భారీ వాహనాలు
- గాల్లో కలుస్తున్న ప్రజల ప్రాణాలు

దేవరపల్లి: కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి మండలంలో జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ, ఈజీకే రహదారుల వెంబడి మలుపులు మృత్యువుకు నిలయంగా నిలుస్తున్నాయి. ఈ రహదారిల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు వణికిపోతున్నారు. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి నిత్యం మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నప్పటికి సంబంధిత అధికారులు కనీస భద్రత చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని ప్రయాణికులు వాపోతున్నారు. మలుపులు మోచేతి వంపు ఉండడంతో ప్రమాదాల ప్రదేశాలుగా గుర్తించిన అధికారులు ఆయా ప్రదేశాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు, రేడియం బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని

దేవరపల్లి-గోపాలపురం జాతీయ రహదారిలో గొల్లగూడెం వద్ద గల మలుపు ప్రాణాలను బలిగొంటుంది. రహదారిలో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. గ్రామంలో నుంచి రహదారి పైకి వచ్చే అంతర్గత రోడ్డు జాతీయ రహదారికి మలుపు వద్ద అనుసంధానం చేశారు. మలుపుకు ఎడమ వైపున చెరువు, కుడి వైపున గ్రామం లోపలకు వెళ్లడానికి రోడ్డు ఉండడం వల్ల భారీ వాహనాలు అదుపుతప్పి నివాసలపైకి దూసుకు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. 2011లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న భారీ వాహనం అదుపు తప్పి తెల్లవారు జామున రోడ్డు ప్రక్కన గల ఇంటిలోకి దూసుకు పోవడంతో నిద్రస్తున్న మహిళ దుర్మరణం చెందింది. 2023 ఫిబ్రవరి 5న గోపాలపురం వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న లారీ మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు ప్రక్కన గల ఇంటిలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పాశం కృష్ణారావుకు చెందిన ఇల్లు ధ్వంసం కాగా, నిద్రస్తున్న కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ నెల 15వ తేదీన గ్రామానికి చెందిన ఈరోతు జయకృష్ణ(35) ఇంటి నుంచి గోపాలపురం బైక్‌పై వెళుతుండగా మలుపు వద్ద అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయకృష్ణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

స్టాపర్ల ఏవీ.?

జాతీయ రహదారుల నిర్మాణం జాగ్రత్తలతో చేపట్టాలి. కానీ కాంట్రాక్టులు దక్కించుకున్న సంస్థలు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టాయి. రోడ్డు నిర్మాణానికి ముందే పూర్తిగా సర్వే చేసి ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. జంక్షన్ల వద్ద సరిపడా ట్రాఫిక్ సిగ్నల్స్, పెద్ద ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తిస్తే అక్కడ స్పష్టంగా కనిపించేలా సూచికలు, ఎల్లో కలర్‌తో స్టాపర్లు, బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. యర్నగూడెం నుంచి యాదవోలు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు, దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో చెరువు వద్ద గల మలుపు, సంగాయగూడెం-చిన్నాయగూడెం మధ్య గల మలుపు, కృష్ణంపాలెం వద్ద ఏలూరు-గుండుగొలను-కొవ్వూరు (ఈజీకే) రోడ్డు నుంచి హైవేకు అనుసంధానం చేసిన ప్రదేశం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం, పట్టించుకోకపోవడంతో కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్లక్ష్యంగా ఉంటున్నాయి.



గొల్లగూడెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



నివాసంలోకి దూసుకువెళ్లిన లారీ(ఫైల్)



కృష్ణంపాలెం వద్ద జీఎకే రోడ్డు నుంచి హైవేకి అనుసంధానం చేసిన ప్రదేశం

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



గొల్లగూడెం మలుపు ప్రమాదకరంగా ఉంది. ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన గల ఇళ్లల్లోకి భారీ వాహనాలు దూసుకుపోతున్నాయి. రెండు నెలల్లో నాలుగు ప్రమాదాలు జరగ్గా ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి కావడం వల్ల భారీ వాహనాలు వెళ్తున్నాయి.

–ఉక్కుసూరి శ్రీనివాస్, గొల్లగూడెం, దేవరపల్లి మండలం

దడ పుట్టిస్తున్న మలుపులు



రహదారుల్లోని మలుపులు ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి. మలుపుదల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులను డేంజర్ జోన్‌గా గుర్తించినప్పటికి ఎటువంటి చర్యలు లేవు. ప్రతి మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు పెట్టాలి. రేడియం స్టిక్కరింగ్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలి.

–ఎస్.భగత్, సీపీఎం మండల కార్యదర్శి, దేవరపల్లి

అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలి

- బాలకృష్ణ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి
- మద్యం మత్తులో మాట్లాడం దారుణం

నల్లజర్ల: అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు,గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత డిమాండ్ చేశారు. శనివారం నల్లజర్లలో మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురువారం అసెంబ్లీలో జగన్ సైకోగాడని, చిరంజీవి ఎవడు..నాన్‌సెన్స్..అంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. సైకో అంటూ పదే పదే అంటున్న బాలకృష్ణ సైకో యిజం గురించి ఎవర్ని అడిగినా చెబుతారన్నారు. సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని బాలకృష్ణ చులకనగా మాట్లాడటం తగదన్నారు. బాలకృష్ణ పిచ్చివాగుడు చూసి ప్రజలే ఛీత్కరించుకుంటున్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి అసెంబ్లీలో ఏనాడూ ప్రజా సమస్యలు చర్చించలేదని, మహిళా సమస్యలు గాని,హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఏనాడూ చర్చించలేదన్నారు. సభలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను స్పీకర్ హోదాలో ఉన్న రఘురామకృష్ణరాజు గాని సీఎం, మంత్రులు గాని ఖండించకుండా అలాంటి పదాలు మాట్లాడకూడదని చెప్పడం మాని అందరూ నవ్వడం దారుణమన్నారు. బాలకృష్ణ మాట్లాడే విధానం చూస్తుంటే ఆయన మద్యం మత్తులో ఉన్నట్టు ఉందన్నారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలివేణు, మాజీ జడ్పీటీసీ బంక అప్పారావు, యూత్ నాయకుడు మేణ్ణి కృష్ణచౌదిరి ఉన్నారు.



నల్లజర్లలో విలేకర్లతో మాట్లాడుతున్న తానేటి వనిత

మాజీ హోంమంత్రి వనిత పరామర్శలు

దేవరపల్లి: మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో శనివారం పర్యటించారు. ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లకు ఆమె నాయకులతో కలిసి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మండలంలో బందపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంకు సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకర గంగరాజు, యర్నగూడెం సర్పంచ్ బొంతా భరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. గోపాలపురం మండలం చిట్యాలలో ఇటీవల మరణించిన గుమ్మల సీతమ్మ కుటుంబ సభ్యులను తానేటి వనిత పరామర్శించారు. సీతమ్మ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన గరికిపాటి లక్ష్మీ ప్రసన్న ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుల పీతల ప్రసాద్ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తానేటి వనిత

దుర్గాదేవిని దర్శించుకున్న మాజీ హోంమంత్రి

దేవరపల్లి: దసరా మహోత్సవాల సందర్భంగా మండలంలోని దుద్దుకూరులో బాలాత్రిపుర సుందరి దేవి అవతారంలో ఉన్న దుర్గాదేవిని మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు కుంకుమ, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, గ్రామ కమిటీ అధ్యక్షులు పాపోలు రెడ్డిబాబు, నిమ్మగడ్డ కృష్ణారావు, పార్టీ నాయకులు పెనుమాక వెంకటేష్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



దుద్దుకూరులో దుర్గాదేవిని దర్శించుకుంటున్న తానేటి వనిత

మమ్మేలు.. కనకదుర్గమ్మ

చాగల్లు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా చాగల్లులోని మాతంగి చెరువు గట్టుపై కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. రాత్రి ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహాలక్ష్మమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత పాటమ్మ ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మీనానగరంలో ముత్యాలదిబ్బ వద్ద ఆలయంలో భవానీలు, మహిళలు పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ వారి ఆలయంలో భజనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రావులచెరువు గట్టుపై, ఊనగట్ల బీసీ ఏరియాలో కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారవరం, చిక్కాల, మార్కొండపాడు, ఎస్.ముప్పవరం గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు కిక్కిరిశాయి. చాగల్లులోని వల్లుగుంట కనకదుర్గమ్మ వారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పాటిమ్మపేటలోని బాల కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి కోటసత్తెమ్మ

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్రుల సంబరాలు ఊరూరా అలరిస్తున్నాయి. మండలంలోని తిమ్మరాజుపాలెంలో వెలసియున్న కోటసత్తెమ్మ దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. కోటసత్తెమ్మ అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,30,097 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్యప్రకాష్ చెప్పారు. కంసాలిపాలెం శ్రీదేవిపాటెమ్మ, గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. డి.ముప్పవరంలో కొండాలమ్మ, లోహియానగర్‌లో కనకదుర్గమ్మ అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో పాటిమీద సెంటర్ భీమదొరతూము వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చింతచెట్టు వీధి, శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ శరన్నవరాత్ర మండపాల్లో ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బ్రాహ్మణగూడెంలో ప్రత్యేక అలంకరణలో నాగారమ్మ



ప్రత్యేక పుష్పాలంకరణలో తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ

ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత

నల్లజర్ల: మహిళల ఆరోగ్య భద్రత కోసం ప్రధాని మోదీ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలికిచెర్ల సర్పంచ్ బండి చిట్టీ అన్నారు. తెలికిచెర్ల-2లో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు సిరాజుద్దీన్ మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధులు నివారించేందుకు ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్వచ్ఛమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యనియమాలు పాటించాలని లేకుంటే బాల్యం నుంచే మధుమేహం ,రక్తపోటు వంటి దీర్ఘకాలిక రుగ్మతలకు గురవుతారన్నారు. వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కృష్ణకుమారి, హెచ్.వీ మీరాబాయి, హెచ్‌ఎస్ ప్రకాష్, ఏఎన్‌ఎంలు మహాలక్ష్మి, ఎం.ఎల్ హెచ్ పి.సుశీల, ఎంపీ హెచ్ఏ చంద్రకుమార్ పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో సర్పంచ్ చిననాగరాజు, డాక్టరు సిరాజుద్దీన్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోపాలపురం: గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వాదాలకుంట సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ అన్నారు. మండలంలోని వాదాలకుంట సచివాలయం వద్ద శనివారం 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' పథకంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 250 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లభని సత్యనారాయణ, అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు మందులు అందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మహిళలకు వైద్య పరీక్షలు

నిడదవోలు: పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 350 మందికి వైద్య సేవలు అందించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్, సైకియాట్రిక్, రేడియాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పీడియాట్రిక్, డెంటిస్ట్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫయాజ్ అహ్మద్, వివిధ విభాగాల వైద్యులు రుబినా ఇంతియాజ్, కోటేశ్వరి, విజయకుమారి, షేక్ నసిమా, సుష్మరాణి, దేవి, విక్రమనంత్, శాంతికమల, రాజేంద్రప్రసాద్, పూజిత, హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శశిలో శరన్నవరాత్ర ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కుటుంబసభ్యులు

నిడదవోలు: వేలివెన్ను శశి విద్యాలయ ప్రాంగణంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అష్టాదశ శక్తి పీఠ సంస్థాన స్వరూపిణీ లలిత సహస్రనామ స్తోత్రం శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు లలిత త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. 600 మంది మహిళలు లలిత సహస్రనామం పఠించారు. ఐదు రోజులుగా 4 వేల మంది మహిళలు 16 వేల సార్లు లలిత సహస్రనామం చేశారు. పూజా కార్యక్రమంలో శశి ఫౌండర్ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, డైరెక్టర్ రాధారాణి, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ లక్ష్మీ సుప్రియ ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. వెలివెన్ను పరిసర భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. లలితా సహస్రనామ పారాయణం చేయడానికి వచ్చిన మహిళలకు చైర్మన్ రవికుమార్, వైస్ చైర్మన్ లక్ష్మీసుప్రియ ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్ నారాయణ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఫీడర్‌లో ఆర్‌డీడీఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఆయన వివరించారు.

CHANGE OF NAME

I **SHAIK GOUSE** (old Name) S/o. **SHAIK FARID AHMED** resident of D.No. 5-207, Kotha Peta, Chagallu, East Godavari, Andhra Pradesh - 534 342. I have changed my name as **MOHAMMAD GOUSE** (New Name). Hereafter my name is know as **MOHAMMAD GOUSE** (New Name), S/o. **SHAIK FARID AHMED.**

బార్ తొలగించాలని రాస్తారోకో



నిడదవోలులో రాస్తారోకో చేస్తున్న నాయకులు

నిడదవోలు: పట్టణంలోని సుబ్బరాజుపేటలో ఏర్పాటు చేసిన చైతన్య బార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ బార్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బార్లు, మద్యం షాపులు, బెల్ట్ షాపులు అందుబాటులోకి తెచ్చి కుటుంబాలను దోచుకుంటుందన్నారు. యువకులకు ఉపాధి కల్పించే పరిశ్రమలు, విద్యా సంస్థలు స్థాపించకుండా తమ కుటుంబాలు విచ్ఛిన్నం అయ్యేలా బార్లు, మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటం అన్యాయమన్నారు. జువ్వల రాంబాబు, అంబటి పుల్లారావు, కొడమంచిలి జార్జి తదితరులు పాల్గొన్నారు.

భవానీలను ఢీకొన్న బైక్



మృతి చెందిన ప్రేమ్‌కుమార్ (23)

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల శివార్లో శనివారం చీకటి పడేవేళ నడిచి వెళ్తున్న భవానీలను బైక్ ఢీకొంది.ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న గంటావారిగూడెం శివాలయం వీధికి చెందిన తానెం ప్రేమ్‌కుమార్ (23) అక్కడిక్కడే మృతి చెందాడు. ఏసుపాదం, పద్మల పెద్దకుమారుడు ప్రేమ్‌కుమార్ పెద్దకొడుకు.విద్యుత్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాకినాడ జిల్లా కొత్త ఇసుకపల్లికి చెందిన 13 మంది భవానీలు పాదయాత్రగా వెళ్తుండగా దూబచర్ల ప్రారంభంలో ఫ్లై ఓవర్ వద్ద చీకట్లో భవానీలు కనపడకపోవడంతో యువకుడు వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. బైకిస్ట్ చనిపోగా భవానీలలో ఒకరైన పెంకి లోవరాజుకు కాలు విరిగింది. అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై శోభనాద్రి కేసు నమోదు చేసి మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

తల్లి చెంతకు తప్పిపోయిన చిన్నారులు



తప్పిపోయిన చిన్నారులను తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

నల్లజర్ల: విజయవాడ ఇంద్రకీలాద్రికి నడిచి వెళ్తున్న బృందంలో ముగ్గురు చిన్నారులు తప్పిపోయారు. ఈ విషయాన్ని శనివారం తల్లి నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్షణంలోనే వారిని తల్లి చెంతకు చేర్చారు. పంగిడికి చెందిన భవానీ.. భవానీ మాలధరించి తన ముగ్గురు పిల్లలు, సోదరుడు సురేష్‌తో కలసి శనివారం ఉదయం బయలు దేరింది. నల్లజర్ల దాటేసరికి పిల్లలు కనపడక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో విషయాన్ని ఎస్సై దుర్గాప్రసాద్‌కు వివరించారు. తల్లి ఆచూకీ తెలియక ఆ ముగ్గురు చిన్నారులు సూర్య హోటల్ సమీపంలో ఏడుస్తూ కూర్చున్నారు. సమాచారాన్ని అందుకున్న పోలీసులు క్షణాల్లోనే చిన్నారులను తల్లిచెంతకు చేర్చారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్ నారాయణ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఫీడర్‌లో ఆర్‌డీడీఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఆయన వివరించారు.

